క్లుప్తంగా

కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేద్దాం



వీపనగండ్ల: గ్రామంలో పార్టీ బలోపేతం కోసం ప్రతి ఒక్కరం పనిచేద్దామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బిచ్చన్నసాగర్ అన్నారు. బుధవారం గ్రామంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామ అధ్యక్షుడిగా రఘువర్ధన్‌రెడ్డిని నియమించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు నర్సింహారెడ్డి, పార్టీ నాయకులు ఉప్పరి రాముడు, కురుమయ్య, స్వామి, లక్ష్మీకాంతారెడ్డి, రాజశేఖర్, శ్రీనివాసులు, నర్సింహ పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి పంపిణీ



మదనాపురం: మదనాపురం ఎస్సీ ప్రభుత్వ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు బుధవారం స్టీల్ వాటర్ బాటిళ్లు, జత ప్యారగన్ చెప్పులు, రెండు జతల బట్టలు వార్డెన్ బెనహర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద పిల్లల చదువులకు ప్రభుత్వం ఎంతో తోడ్పాటు కల్పిస్తుందని, దీనిని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

దుప్పల్లి చెక్‌డ్యాం నిరుపయోగం

మదనాపురం: మండలంలోని దుప్పల్లి ఊకచెట్టు వాగుపై నిర్మించిన చెక్ డ్యాం ఎలాంటి ఉపయోగం ఉండదని, దీని వల్ల ప్రజలకు, రైతులకు ఉపయోగం లేకుండా పోయిందని కురుమూర్తి రాయ ఎత్తిపోతల చైర్మన్ రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే జి మధుసూదన్‌రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి విమర్శించడం సరికాదన్నారు. రానున్న స్థానిక ఎన్నికల్లో మండల పరిషత్‌తో పాటు జెడ్పీటీసీని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు పాల్గొన్నారు.

నానో యూరియాపై రైతులకు అవగాహన

వనపర్తి రూరల్: మండలంలోని నాగవరం రైతు వేదికలో కోరమండల్ ఫర్టిలైజర్ కంపెనీ ప్రతినిధి గోవిందరావు ఆధ్వర్యంలో న్యానో యూరియాపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్‌నాయక్, జిల్లా ఉద్యాన అధికారి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. నానో యూరియా, డీఏపీ పనితనం, వినియోగ పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు, క్లస్టర్ విస్తరణ అధికారులు, ఉద్యాన అధికారులు, ఫ్రీ యూనిక్ కంపెనీ వారు, కోరమండల్ సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

వనపర్తిటౌన్: పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర్లు హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం జిల్లా కేంద్రంలోని 27, 30, 32, 6, 28, 30 వార్డుల్లో 100 రోజుల కార్యాచరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో సీజనల్ వ్యాధులు, డెంగీ, మలేరియాపై అవగాహన, ఇంటింటి తడి, పొడి వ్యర్థాల విభజన, వీధి, పెంపుడు కుక్కలపై ఏబీసీ ప్రచారం, కొత్త ఎస్‌హెచ్‌జీ ఏర్పాటు, స్ట్రీట్ వెండర్స్ అవర్నెస్, అకౌంట్ ఓపెనింగ్, భువన్, సర్వే పనులు చేపట్టినట్లు తెలిపారు. ట్రేడ్ లైసెన్స్ రెసిడెన్షియల్ టూ కమర్షియల్ కన్వర్ట్, కాలనీల్లోని డ్రెయినేజీలో మురుగు తీయించి, రోడ్లను శుభ్రం చేసే పనులను పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమా మహేశ్వర్ రెడ్డి, డీఎంసీ బాలరాజు, సూపర్‌వైజర్, వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలను కించపరిస్తే సహించేది లేదు

చిన్నంబావి: అధికార అహంకారంతో మహిళలను విమర్శిస్తే సహించేది లేదని బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఈదన్నయాదవ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ సోమేశ్వరమ్మ, మాజీ జెడ్పీటీసీ వెంకట్రామణమ్మ తో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంత్రి జూపల్లి అండతో కాంగ్రెస్ నాయకులు మండలంలో ప్రజలను భయాభ్రాంతులకు గురి చేస్తున్నారని, మాజీ ప్రజాప్రతినిధులు మహిళలను ఇష్ట మొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌ను ఉపయోగించుకొని అమాయక ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. మహిళలపై చేసిన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో గోవిందు, శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

సెగ్రిగేషన్ షెడ్లపై శ్రద్ధ ఏది?

- ప్రతి గ్రామపంచాయతీలో షెడ్డు ఏర్పాటు
- చెత్తను తగులబెడుతున్న కార్మికులు



కేశంపేట సెగ్రిగేషన్ షెడ్డు పక్కన పొడిచెత్తకు నిప్పంటించిన సిబ్బంది (ఫైల్)

గోపాల్‌పేట: గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను సేకరించి ట్రాక్టరు ద్వారా సెగ్రిగేషన్ షెడ్లలో తడి పొడి చెత్తను వేరుగా వేసి తడిచెత్తతో సేంద్రియ ఎరువు తయారు చేయడం, పొడిచెత్తను డంపింగ్ యార్డులకు తరలించాలనే ఉద్దేశంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సుమారు ఐదేళ్ల క్రితం ప్రతి గ్రామ పంచాయతీకి ఒక సెగ్రిగేషన్ షెడ్డును రూ.2.50లక్షలతో ఏర్పాటు చేశారు. తడిచెత్త ద్వారా సేంద్రియ ఎరువులు తయారు చేయడం, ఎరువును అవసరమైన రైతులకు అందించడం, లేదంటే స్థానికంగా ఉండే నర్సరీలు, పల్లెప్రకృతి వనాలకు వాడుకునేందుకు నిబంధనలు ఉండేవి. ప్రస్తుతానికి ఉమ్మడి మండలంలోని సేంద్రియ ఎరువు తయారు చేస్తున్నామని, పొడిచెత్తను అమ్ముతున్నామని అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఎక్కడా పూర్తిస్థాయిలో అలా జరగడం లేదు. చాలా వరకు సెగ్రిగేషన్ షెడ్లలో చెత్త వేయకుండా ఆయా గ్రామాల శివార్లలో చెత్తను వేస్తున్నారు. లేదంటే సమీపంలోనే చెత్తను వేసి కాల్చుతున్నారు. చెత్త సేకరించి గ్రామ పంచాయతీలకు నిధులు సమకూర్చుకునే విధంగా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

మండలంలో పరిస్థితి

సెగ్రిగేషన్ షెడ్లలో నాడేప్ పద్ధతి, వర్మీకంపోస్ట్ పద్ధతుల ద్వారా ఎరువులు తయారు చేయొచ్చు. నాడేపు పద్ధతిలో ట్యాంకు నిర్మించి, సేకరించిన చెత్తను అందులో వేసి దానిపై ఐదు కిలోల పేడను సగం డ్రమ్ము నీటిలో కలిపి చల్లుతారు. అనంతరం 20 గంపల మట్టి పోసి మళ్లీ పేడనీరు పోసి 16 వారాలు మక్కబెట్టి ఎరువును తయారు చేస్తారు. వర్మీకంపోస్ట్ పద్ధతిలో వానపాములకు సేంద్రియ పదార్థాలను ఆహారంగా వేసి 40 నుంచి 45 రోజుల్లో ఎరువు తయారు చేయవచ్చు. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలో గతంలో 27 గ్రామ పంచాయతీలు ఉండేవి. ప్రస్తుతం కోడేరు మండలం నుంచి ఆరు గ్రామ పంచాయతీలను తీసుకుని ఏదుల కొత్త మండలం ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఒక సెగ్రిగేషన్ షెడ్డును ఏర్పాటు చేశారు. తడిచెత్త, పొడిచెత్త వేరువేరు చేసి వాటి ద్వారా గ్రామ పంచాయతీకి నిధులు రాబట్టాలని అనుకున్నారు. కానీ ఉమ్మడి మండలంలో ఏ ఒక్క సెగ్రిగేషన్ షెడ్డులో కూడా పూర్తిస్థాయిలో చెత్తను వేరుగా వేయడం, చెత్తద్వారా నిధులు సమకూర్చడం జరగడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. కేశంపేట,రేవల్లి, గోపాల్‌పేట, చెన్నూరు ఇలా కొన్ని గ్రామాల్లో పొడిచెత్తను కొన్నిసార్లు కాలుస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో సెగ్రిగేషన్ షెడ్లలో కుక్కలు పడుకుంటున్నాయి. అధికారులు చొరవ తీసుకుని ప్రతి సెగ్రిగేషన్ షెడ్డులో సేంద్రియ ఎరువులు తయారు చేసేందుకు చర్యలు తీసుకుని గ్రామ పంచాయతీలకు నిధులు సమకూరేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

గ్రామపంచాయతీ దృష్టి సారించాలి..



గ్రామ పంచాయతీలకు డబ్బు కొరత ఉందని కొన్ని పనులు కావడం లేదు. డబ్బు కొరత ఉన్నప్పుడు సెగ్రిగేషన్ షెడ్లు వినియోగించుకుని తడిపొడి చెత్తద్వారా, కంపోస్టు ఎరువు తయారీ ద్వారా డబ్బు వచ్చేలా ఆలోచన చేస్తే బాగుంటుంది. కోట్లరూపాయల ప్రజాధనంతో నిర్మించిన సెగ్రిగేషన్ షెడ్లు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. అధికారులు దృష్టిసారించి వినియోగించుకోవాలి.

– గడ్డికోపుల మహేష్, చీర్కపల్లి

పూర్తిస్థాయిలోకి రాగానే చర్యలు తీసుకుంటాం..



ఏదుల మండలం నూతనంగా ఏర్పడింది. కోడేరు నుంచి, గోపాల్‌పేట నుంచి, రేవల్లి మండలాల నుంచి నూతనంగా ఏర్పడిన మండలం ఇది. ఇంకా పూర్తి స్థాయిలో బైఫరిగేట్ కాలేదు. ఏ మండలంలో ఉన్న సెగ్రిగేషన్ షెడ్ల పనులు ఆ గ్రామ పంచాయతీ అధికారులే చూస్తున్నారు. పూర్తి స్థాయిలో సిబ్బంది రాలేదు. ఉపాధి సిబ్బంది పూర్తి స్థాయిలో వచ్చిన వెంటనే ఎరువులు తయారు చేయించడం, తడిపొడి చెత్తను వేరు చేసి పనులు ప్రారంభిస్తాం.

– రాములు, ఎంపీఓ, ఏదుల

మాతృత్వం ఓ వరం.. దత్తత మరో మార్గం



పోస్టర్ విడుదల చేస్తున్న అధికారులు

వనపర్తి రూరల్: మాతృత్వం ఒక వరం, అందుకు దత్తత మరో మార్గం అని బాలల పరిరక్షణ అధికారి సురేందర్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఆయన చట్టబద్ధమైన దత్తతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలల న్యాయ(బాలల రక్షణ, సంరక్షణ) చట్టం 2015 ప్రకారం ప్రభుత్వమే కోర్టు ద్వారా చట్ట బద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందన్నారు. చట్ట విరుద్ధంగా పిల్లలను దత్తత ఇచ్చినా, తీసుకున్న వారికి 3 ఏళ్ల కారాగార శిక్ష, లక్ష రూపాయల జరిమానా ఉంటుందన్నారు. ఏ ప్రయోజనం కోసం అయినా ఒక బాలుడు/బాలిక అమ్మటం కానీ, కొనటం కానీ జరిగితే వారికి ఐదేళ్ల వరకు శిక్ష, లక్ష రూపాయల జరిమానా విధించనున్నట్లు తెలిపారు. వైద్యశాల, నర్సింగ్, హోమ్ ప్రసూతి గృహంలో పనిచేసే సిబ్బంది నేరానికి పాల్పడితే వారికి 3 ఏళ్ల జైలు శిక్ష ఉంటుందన్నారు. ఇప్పుడు దత్తత చాలా సులభమని, ఆన్‌లైన్‌లో ఇంటి వద్ద నుంచి దత్తత కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అనంతరం పోస్టర్ విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాఘవ, ఎంపీఓ రవీంద్ర బాబు, పంచాయతీ కార్యదర్శులు, ఔట్ రీచ్ వర్కర్ పరేష్ పాల్గొన్నారు.

ఘనంగా ఏబీవీపీ వ్యవస్థాపక దినోత్సవం

పాన్‌గల్: మండల కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏబీవీపీ పూర్వ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొంకల గట్టయ్యనాయుడు పాల్గొని జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం నాయకులు రాకేష్, శరత్, లక్ష్మణ్, వంశీయాదవ్ పాల్గొన్నారు.

అమరచింత: విద్యార్థుల హక్కుల సాధనకోసం ఏబీవీపీ నిరంతరం ప్రభుత్వాలతో రాజీలేని పోరాటం చేస్తున్నదని ఏబీవీపీ పట్టణ అధ్యక్షుడు రాజేష్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బస్టాండ్ రహదారి పక్కన ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సాయికుమార్, అఖిల్, సందీప్, నిజగుణ, ఉదయ్, తిరుమలేష్, అఖిల్,అఖిల పాల్గొన్నారు.

గోపాల్‌పేట: మండల కేంద్రంలో హిందూ వాహిని జిల్లా కన్వీనర్ అరుణ్ ఏబీవీపీ దినోత్సవంలో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నితిన్, సాయి, భాస్కర్ పాల్గొన్నారు.



చేప పిల్లలు వద్దు.. నగదు ఇవ్వాలి



సీఎంకు రిజిస్టర్ పోస్టు పంపుతున్న అజ్జకొల్లు మత్స్యకారులు

మదనాపురం: మండలంలోని అజ్జకొల్లు మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లలకు బదులుగా నగదు బదిలీ చేయాలని బుధవారం సీఎం రేవంత్‌రెడ్డికి రిజిస్టర్ పోస్టు ద్వారా మత్స్యకారులు పంపించారు. ఈ సందర్భంగా వనపర్తి జిల్లా మత్స్య కార్మికుల సంఘం జిల్లా కమిటీ సభ్యుడు మొగిలి మాట్లాడుతూ కార్మికులు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీలో కాంట్రాక్టర్లు, అవకతవకలకు పాల్పడి నాసిరకమైన చేప పిల్లలను సరఫరా చేయడం వల్ల జిల్లాలోని మత్స్యకారులు, తీవ్రంగా నష్టపోతున్నారని, ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి టెండర్ల ద్వారా చేప పిల్లల పంపిణీని కాంట్రాక్టర్లకు అప్పగించడంతో మత్స్యకారులు తమ జీవనోపాధిని కోల్పోతున్నారని పేర్కొన్నారు. చేప పిల్లలకు బదులు జిల్లాలోని మత్స్య కారుల సహకార సంఘం ఖాతాల్లో నగదు డబ్బు జమ చేయాలని కోరారు. కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సంఘం సభ్యులు సత్యనారాయణ, ఎ బాలకృష్ణ, రాజకుమార్, పరమేష్, మొగిలన్న, శివ తదితరులు పాల్గొన్నారు.

పర్వతాపురం దళితుల భూముల పరిశీలన



ఖిల్లాఘనపురం మండలం పర్వతాపురంలో భూములను పరిశీలిస్తున్న తహసీల్దార్

ఖిల్లాఘనపురం: మండలంలోని పర్వతాపురం గ్రామంలో ఎస్సీలకు ఇచ్చిన భూములను బుధవారం తహసీల్దార్ సుగుణ పరిశీలించారు. పర్వతాపురం గ్రామ శివారులోని సర్వే నంబర్ 229 లో 1997–98లో కార్పొరేషన్ ద్వారా భూములను ఎస్సీలకు ప్రభుత్వం పంపిణీ చేసినట్లు ఆమె తెలిపారు. మొత్తం 14.32 ఎకరాల భూమిని గ్రామంలోని 7మంది రైతులకు పంపిణీ చేయడం జరిగిందన్నారు. వారికి ఇప్పటి వరకు పట్టా కాకపోవడంతో వారు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. భూమిని పరిశీలించి పూర్తి వివరాలను తెలుసుకోవడానికి భూములను పరిశీలించినట్లు తెలిపారు. నివేదికను పైఅధికారులకు పంపించి వారి ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు.

అమృత్ పథకాన్ని పూర్తి చేయాలి



మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కొత్తకోట: అమృత్ పథక పనులు తక్షణమే ప్రారంభించాలని భారతీయ జనతా పార్టీ పట్టణ శాఖ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక మున్సిపల్ కేంద్రాన్ని ముట్టడి చేసి మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ మాజీ కౌన్సిలర్ భరత్ భూషన్ పాల్గొని మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రానికి కేంద్రం మే 20, 2023న రూ.5,385.05 కోట్ల నిధులు విడుదల చేసిందని, అందులో కొత్తకోట పురపాలక సంఘానికి రూ.14.95 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. కొత్తకోట పురపాలక సంఘానికి ఈ మొత్తం నిధులు విడుదలై రెండేళ్లు గడుస్తున్నా పనులు ప్రారంభించలేదని ఆరోపించారు. నిధులు విడుదలైనప్పటికీ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 18 నెలలు అవుతున్న పనులు ప్రారంభించలేదన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలోని అన్ని పురపాలక సంఘాలలో అమృత్ పథకం పనులను ప్రారంభిస్తే, దేవరకద్ర నియోజవర్గంలోని కొత్తకోట మున్సిపల్ పరిధిలో పనులు ఇప్పటి వరకు ప్రారంభించలేదని ఆయన తెలిపారు. పనులను తక్షణమే ప్రారంభించాలని మున్సిపల్ కార్యాలయాన్ని బీజేపీ ముట్టడి చేయడంతో సంబంధిత మంత్రిత్వ శాఖ కాంట్రాక్టర్‌కు మెమో జారీ చేసిన కారణంగా బుధవారం పనులను కంటి తుడుపు చర్యగా ప్రారంభించారని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

జాతీయస్థాయిలో సత్తా చాటాలి



నవీన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

వనపర్తి: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయిలో సత్తా చాటి జిల్లాకు పేరు తేవాలని ఎమ్మెల్యే మేఘారెడ్డి సూచించారు. పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రగ్బీ క్రీడాకారుడు నవీన్‌రెడ్డి ఈ నెల 5, 6 తేదీల్లో సికింద్రాబాద్ జింఖానా గ్రౌండ్‌లో నిర్వహించిన రగ్బీ అండర్-18 బాలుర విభాగం పోటీలో ప్రతిభ కనబరిచి వనపర్తి జిల్లా నుంచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక య్యాడు. ఈ నెల 10 నుంచి 14 వరకు ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటాడు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేఘారెడ్డి బుధవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో క్రీడాకారుడిని శాలువాతో సన్మానించి, రూ.3వేల ఆర్థికసాయం అందించారు. నవీన్‌రెడ్డిని జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు మన్నె మన్నెపురెడ్డి, కార్యదర్శి మహమ్మద్ హఫీజ్, కోశాధికారి మహనంది, ప్రగతి ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో చందు పాల్గొన్నారు.

'దుర్భాషలాడితే సహించేది లేదు'



మాట్లాడుతున్న గుండ్రాతి వామన్ గౌడ్

కొత్తకోట: బీఆర్ఎస్ పార్టీ మాజీ మంత్రి హరీష్ రావు, దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిలను కాంగ్రెస్ నాయకులు తమ పదజాలంతో దుర్భాషలాడితే సహించేది లేదని జిల్లా జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గుండ్రాతి వామన్‌గౌడ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికలలో దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి గెలుపు గెలుపే కాదని, ఇది ముమ్మాటికి గప్లత్ గెలుపేనని ఆయన అన్నారు. ప్రజలను తికమక పెట్టి హామీ పత్రాలను ప్రజల చేతికిచ్చి మోసం చేసి గెలిచిన గెలుపును గప్లత్ అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీలు 420 హామీల అమలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధిపై కాంగ్రెస్ చర్చకు సిద్ధమేనా? చర్చకు కొత్తకోట చౌరస్తాకు రావాలని ఆయన సవాలు విసిరారు. మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డిపై ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అనుచిత వ్యాఖ్యలు సరికావన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రశ్నిస్తే బీఆర్ఎస్ కార్యకర్తలపై కేసులు పెట్టి, ఇబ్బందికి గురిచేయడం సరికాదని, వారి పద్ధతి మార్చుకోవాలన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటి మెజార్టీ స్థానాలు గెలవడం ఖాయమన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ సుకేషిణి విశ్వేశ్వర్, మాజీ సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, కొండారెడ్డి, రవీందర్‌రెడ్డి, అయ్యన్న, ఆకుల శ్రీనివాసులు, గోపాల్ నాయక్, శ్రీను, జీ.రాములు యాదవ్, నరేష్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల కోసమే అరకొర పథకాలు



మాట్లాడుతున్న దిలీప్‌కుమార్‌రెడ్డి

వనపర్తి రూరల్: పెబ్బేరు పట్టణ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు దిలీప్‌కుమార్ రెడ్డి బీఆర్ఎస్ నాయకులతో కలిసి పట్టణంలో 3, 4 వార్డుల్లో ఇంటింటికి తిరుగుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని తుంగలో తొక్కి ప్రజలను మోసం చేసిందని వారికి వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారంటీలను పూర్తిగా అమలు చేయలేదన్నారు. ప్రజలను అమాయకులను చేసి ఓట్లను దండుకోవాలని చూస్తున్నారని, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించాలని వారికి సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సాయినాథ్, చిన్న ఎల్లారెడ్డి, విశ్వరూపం, శంకర్‌నాయుడు, యాదగిరిగౌడ్, సోప్పరి బీచుపల్లి, శాంతన్న, ఎల్లయ్య, కుమ్మరి రాజు, వేణు, సాయిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల సమస్యలపై వినతి



పాన్‌గల్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

పాన్‌గల్: దివ్యాంగుల ఎన్‌పీఆర్‌డీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో దివ్యాంగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఆ సంఘం నాయకులు బుధవారం తహసీల్దార్ అబ్రహంలింకన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా నాయకులు మల్లెపునర్సింహ మాట్లాడుతూ పెన్షన్ పెంపు, కార్పొరేషన్‌ను బలోపేతం చేయాలన్నారు. వికలాంగులు ఎదుర్కొంటున్న ఆయా సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

మదనాపురం: మండల కేంద్రంలో దివ్యాంగుల పెండింగ్ పింఛన్లు మంజూరు చేయాలని, దివ్యాంగుల కార్పొరేషన్ బలోపేతం చేయాలని తహసీల్దార్ జేకే మోహన్‌కు వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల నాయకులు చెన్నయ్య, చిన్నరాయుడు, నాగమ్మ, పరశురాములు, వెంకటేశు, సిపిఎం నాయకులు మండల కార్యదర్శి వెంకట్రాములు, చిరంజీవి, మనివర్ధన్ పాల్గొన్నారు.

నేడు గురుపౌర్ణమి వేడుకలు

అమరచింత: పట్టణంలోని షిరిడిసాయి మందిరంలో గురువారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు కొట్టం వెంకట్‌రెడ్డి తెలిపారు. ఉదయం 6 గంటలకు గణపతిపూజతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 7 గంటలకు అభిషేకం, 9:30 గంటలకు వ్యాస మహర్షిపూజ, 10:30 గంటలకు సాయి సత్యవ్రతం, మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు. సాయంత్రం పల్లకీ సేవ, రాత్రి 9గంటలకు మంగళ హారతి ఉంటుందని పేర్కొన్నారు.

లేబర్ కోడ్లు రద్దు చేయాలి

- సార్వత్రిక సమ్మెలో నినదించిన కార్మికులు
- మద్దతు తెలిపిన కార్మిక, ఉద్యోగ సంఘాలు



అమరచింతలో సమ్మెలో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: పెట్టుబడి దారుల కోసం కార్మిక వర్గాన్ని బలి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని బుధవారం వివిధ కార్మిక, ఉద్యోగ సంఘాల కార్మికులు, నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెలో భాగంగా సామాజిక భద్రత కోడ్ పేరుతో 9 కార్మిక చట్టాలను రద్దుచేసి పీఎఫ్, ఈఎస్ఐ భద్రత లేకుండా చేసిందన్నారు. స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించే పని పక్కన పెట్టిందన్నారు. వేతనాల కోడ్ పేరుతో వేతనాల చెల్లింపు చట్టం 1936, కనీస వేతనాల చట్టం 1948, బోనస్ చెల్లింపు చట్టం1965, సమాన వేతన చట్టం 1976, నాలుగు చట్టాల స్థానంలో వేతనాల కోడ్ తెచ్చి వేతనాలకు గ్యారంటీ లేకుండా చేసిందన్నారు.

❖ పాన్‌గల్ మండల కేంద్రంలో వివిధ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ చౌరస్తా, గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎండీ.జబ్బార్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి సూర్యవంశ రాము, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బాల్యనాయక్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భగత్, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కమలాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు దేవేందర్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

❖ వీపనగండ్లలో పలువురు కార్మికులు, కాంట్రాక్ట్ ఉద్యోగులు భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బాల్‌రెడ్డి, సీఐటీయూ మండల కన్వీనర్ బాలగౌడ్, ఉపాధ్యక్షుడు మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

❖ మదనాపురంలో గ్రంథాలయం నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్క ర్లు, కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బొబ్బిలి నిక్సన్, వెంకట్రాములు, శారద మాట్లాడారు.

❖ కొత్తకోట పట్టణంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ప్రధాన కూడలిలో భారీ ర్యాలీ,ధర్నా నిర్వహించారు.

❖ అమరచింత పట్టణంలోని చేనేత ఉత్పత్తిదారుల సంఘం క్లస్టర్ ఆధ్వర్యంలో చేనేత చీరల తయారీ, మహిళలకు టైలరింగ్ శిక్షణ పొందుతున్న కార్మికులు దేశవ్యాప్త సమ్మెలో భాగంగా నిరసన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్, రైతు సంఘం జిల్లా కోశాధికారి వెంకటేష్, కేవీపీఎస్ జిలా ఉపాధ్యక్షుడు ఎస్ఈ.శ్యాంసుందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర మాట్లాడారు.

❖ గోపాల్‌పేట, ఏదుల మండల కేంద్రంలో డీవైఎఫ్ఐ నాయకులు సమ్మెలో పాల్గొని నిరసన తెలిపారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మహేష్ మాట్లాడారు. రాజు, రమేష్, భగవంతు, ఆవాజ్‌సంగం చాంద్‌పాషా పాల్గొన్నారు.

❖ అమరచింత మండల కేంద్రంలో సీఐటీయూ, టీయూసీఐ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ, ఐఎన్‌టీయూసీ సంఘాల నాయకులు సమ్మెలో కదంతొక్కారు. రాజన్న, రమేష్, జీఎస్.గోపి పాల్గొన్నారు.



మదనాపురంలో



ఏదులలో..



పాన్‌గల్‌లో ..